క్లుప్తంగా

పండగ రోజుల్లో అమ్మవారికి బంగారు చీర

బోట్‌క్లబ్: సంక్రాంతి సందర్భంగా భోగి, సంక్రాంతి, కనుమరోజుల్లో స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలా త్రిపురసుందరి అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం విలేకర్లకు తెలిపారు. 15న ఆలయంలో పల్లకిసేవ, సాయంత్రం అయ్యప్ప స్వామికి లక్ష పుష్పార్చన, అనంతరం జ్యోతి దర్శనం ఉంటాయన్నారు. 16న ప్రభల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న పీవో తేజేశ్వరరావు

బాలాజీచెరువు: రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా వైద్యశాఖాధికారి జె.నరసింహానాయక్ పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఒక వ్యక్తి రక్తదానం ద్వారా నలుగురి ప్రాణాలు కాపాడవచ్చని, విద్యార్థి దశలో ఇటువంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. శిబిరంలో భాగంగా 30 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం 18వ సారి రక్తదానం చేస్తున్న పీవో తేజేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌టీఓ డాక్టర్ రమేష్, కళాశాల కార్యదర్శి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రొబేషనరీ ఆఫీసర్స్ ఉద్యోగాలకు 16 మంది ఎంపిక

బాలాజీచెరువు: ప్రొబేషనరీ ఆఫీసర్స్ ఎంపికకు నిర్వహించిన ఫైనల్ పరీక్షలో ఆదిత్య పోటీ పరీక్షల సంస్థ విద్యార్థులు 16 మంది ఎంపికయ్యారని శిక్షణ సంస్థ డైరెక్టర్ డీఎస్ గణేష్ బుధవారం తెలిపారు. బ్యాంక్ ఉద్యోగాల అత్యధిక పోటీని అధిగమించి విజయం సాధించేలా శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని, ఉద్యోగాలు సాధించిన వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి అభినందించారు.

సౌరశక్తి సుస్థిర అభివృద్ధిపై సదస్సు


సౌరశక్తి అవశ్యకతను వివరిస్తున్న వెంకటేష్

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సౌరశక్తి సుస్థిర అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జర్మనీ కొలంబో వర్సిటీ అధ్యాపకులు పంపన వెంకటేష్ హాజరై శిలాజ ఇంధన వాడకాన్ని నిలిపివేయడంతో పాటు అవసరమైన పునరుత్పాదక ఇంధనాలైన సౌరశక్తి వైపు మానవాళి మళ్లవలసిన అవశ్యకతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సువర్చల, క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ నిర్వాహకులు ఎం.వసంత, అధ్యాపకులు సంజోత, భౌతికశాస్త్ర ఇన్‌చార్జి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీలో డయల్ యువర్ డీఎం

కాకినాడ: కాకినాడ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేశారు. పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ప్రభాకరరావు ఫోన్ చేసి పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద అన్ని దూర ప్రాంత సర్వీసులకు స్టాప్ ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విషయమై వెంటనే తగు చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు. కాకినాడ ఆర్టీవో ఆఫీస్ మీదుగా సామర్లకోట, పిఠాపురం పట్టణాలకు బస్సులు నడపాలని కాకినాడ శశికాంత్ నగర్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్, ఇలా పలువురు ఫోన్ చేసి సమస్యలు తెలియజేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల బైక్ ర్యాలీ

కాకినాడ సిటీ: సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం 22వ రోజు కొనసాగింది. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనాలు అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు ఎంవీ సాయికిరణ్, ఎ.లోవరాజు, పీవీవీ మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

కాకినాడ సిటీ: కనీస వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలనే డిమాండ్లపై చేస్తున్న నిరవధిక సమ్మె 30 వ రోజు బుధవారం కొనసాగింది. 24 గంటల రిలే దీక్షలు నాలుగో రోజుకు చేరాయి.


వాకాడలో రంగవల్లులు వేస్తున్న మహిళలు


జగనన్న సంక్రాంతి సంబరాల్లో ఫైనల్స్ విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు


నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో పొంగలి తయారుచేస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ప్రతి ఇంటా సంక్రాంతి శోభే లక్ష్యం

- ఎంపీ, ఎమ్మెల్యేలు వంగా గీత, ద్వారంపూడి
- ఉల్లాసంగా జగనన్న సంక్రాంతి సంబరాలు
- రూ.35 లక్షల విలువైన బహుమతుల పంపిణీ

కాకినాడ: ప్రతి మహిళా సుఖ సంతోషాలతో ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట పోటీలు ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ సంబరాలు బుధవారం స్థానిక ఆనంద భారతి గ్రౌండ్స్‌లో ముగిశాయి. సచివాలయాల పరిధిలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, టగ్‌ఆఫ్‌వార్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి సాంప్రదాయ పట్టువస్త్రాలు, పంచెకట్టుతో హాజరయ్యారు. ఆ ప్రాంగణం వద్ద సంక్రాంతిని తలపించేలా గంగిరెద్దులు, హరిదాసులు, చిలకజోస్యాలను ఏర్పాటు చేశారు. సుమారు 20 రోజులపాటు జరిగిన ఈ పోటీలలో గెలుపొందిన వారితో బుధవారం సాయంత్రం ఫైనల్స్ నిర్వహించారు. ప్రథమ బహుమతిగా వాషింగ్ మెషీన్, రెండో బహుమతిగా ఫ్రిజ్, తృతీయ బహుమతిగా టీవీలు అందజేశారు. కాకినాడలోని 84 సచివాలయాల పరిధిలో దాదాపు 17వేల మంది మహిళలు పోటీలలో పాల్గొనగా సుమారు 3,500 మందికి రూ.35 లక్షలు విలువైన బహుమతులను ఎమ్మెల్యే ద్వారంపూడి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎంపీ గీత మాట్లాడుతూ సీఎం జగన్ మహిళల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని, అదే లక్ష్యంతో ఎమ్మెల్యే ద్వారంపూడి సంక్రాంతి సంబరాలను


సంక్రాంతి సంబరాల్లో ఎడ్ల బండి వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కుటుంబ పోషణలో క్షణం తీరికలేకుండా ఉండే మహిళలకు ఈ సంబరాలు ఓ ఆటవిడుపు అన్నారు. ఫైనల్స్ విజేతలకు ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు బహుమతి ప్రదానం చేశారు.


రమణయ్యపేట సచివాలయం వద్ద రంగవల్లులు దిద్దుతున్న మహిళలు

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యక్రమానికి హాజరయ్యారు.

ఊరూ వాడా సంబరాలు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో సంక్రాంతి సందడి మొదలైంది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుల పర్యవేక్షణలో విజేతలకు గ్రామ, సచివాలయ స్థాయిలో ఎమ్మెల్యే కన్నబాబు బహుమతులను ఏర్పాటు చేశారు. రమణయ్యపేట సచివాలయం - 1 వద్ద ముగ్గుల పోటీలు బుధవారం స్థానిక నాయకుడు మోకా కృష్ణంరాజు పర్యవేక్షణలో జరిగాయి.

నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో..

అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. రంగవల్లులు, భోగి మంటలు, పొంగలి తయారీ సంప్రదాయంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, ర్యాంప్ వాక్‌లతో అలరించారు.

కరప మండలంలో..

కరప: మండలంలో జగనన్న సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. రంగవల్లులు, మ్యూజికల్ చైర్, స్పూన్ అండ్ లెమన్ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండోరోజు వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, వేళంగి, కూరాడ, సిరిపురం గ్రామాల్లో సంబరాలు నిర్వహించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి ఆయా గ్రామాల్లో పర్యటించి పీడీలు, సచివాలయం సిబ్బందితో కలసి పోటీలను పర్యవేక్షించారు. సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, కమిడి మంగాదేవి, అడబాల సత్య, చింతా నాగలక్ష్మి, ఎస్.నీలిమ, నున్న సుజాత, కార్యదర్శులు పి.వీరభద్రరావు, పి.ఉమామహేశ్వరి, పి.శ్రీనివాస్‌లతో కలసి ఎంఈఓ బుల్లికృష్ణవేణి విజేతలను ప్రకటించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: జిల్లా సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు రామానుజన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి కామేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఆర్థిక కార్యదర్శి సిద్ది వెంకటేశ్వరరావు, కాకినాడ టౌన్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంగాడి రాజసింహ వర్మ, ఆర్థిక కార్యదర్శి ములంపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాపాక శ్రీనివాస్, ఎంఈఓ శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

కాకినాడ సిటీ: గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించి సుస్థిర అభివృద్ధి ప్రణాళిక లక్ష్యాల రూపకల్పనపై జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ ప్రజలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రణాళికలు రూపొందించి వారిని భాగస్వాములు చేయాలన్నారు. ప్రతి మండలంలో ఈనెల 17, 18 తేదీల్లో మండల స్థాయిలో జీపీడీపీ, బీపీడీపీ శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. డీపీఓ కె.భారతీసౌజన్య, సీనియర్ ఫ్యాకల్టీ ఎ.శ్రీనివాస్, డీఎల్‌పీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ ముందస్తు అభివృద్ధి ప్రణాళికల తయారీపై వివరించారు. డీఎల్‌పీవో అన్నామణి, డీపీఆర్‌సీ ఏవో కేఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

కరప: మండలం విజయరాయుడుపాలెంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ బుధవారం రాత్రి తెలిపారు. ఆయన కథనం మేరకు విజయరాయుడుపాలెంలోని శ్మశానవాటిక సమీపంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో తమ సిబ్బంది దాడిచేసి, 10 మంది జూదరులను అరెస్ట్‌చేసి, వారినుంచి రూ.6,200 స్వాధీనం చేసుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


వేళంగిలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కన్నబాబు
- వేళంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కరప: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం వేళంగి గ్రామ సచివాలయం-2 పరిధిలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్లు వేయించాలని కోరగా ఎమ్మెల్యే కన్నబాబు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సర్పంచ్ సవిలే నీలిమ, ఉప సర్పంచ్ కుంచే అయ్యన్న, ఎంపీటీసీలు కొప్పిశెట్టి సూరిబాబు, మునిని సూరిబాబు, పార్టీ నాయకులు గరగ జెమ్మి, సవిలే రాజేష్, సానా శ్రీను, జీలకర్ర దుర్గారావు, జవ్వాది రాంబాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆయనను ఇంటింటికీ తీసుకువెళ్లారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని, పాలనలో సంస్కరణలు తీసుకువచ్చి, రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని కన్నబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, ఎంపీడీఓ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

97.44 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,789 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా బుధవారానికి 11,487 మందికి (97.44 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. అన్ని రకాల పింఛన్లసొమ్ము రూ.3,46,61,000 ఇవ్వాల్సి ఉండగా రూ.3,37,88,000 లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. కొరిపల్లి గ్రామసచివాలయంలో 99.05 శాతం, అరట్లకట్ట గ్రామ సచివాలయం 98.90 శాతం, వాకాడ గ్రామ సచివాలయాలు 98.84 శాతంతో పింఛన్ల పంపిణీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయని ఎంపీడీఓ తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

మండలం నడకుదురు గ్రామానికి చెందిన అల్లు వీరన్న అనారోగ్య కారణాలతో కాకినాడలోని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి పీఎస్ఆర్ బ్రహ్మానందం స్పందించి పింఛన్ అందజేయాలని వలంటీర్ ఎస్.నాగలక్ష్మికి సూచించారు. దీంతో ఆమె బుధవారం కాకినాడ ఆసుపత్రికెళ్లి పెంచిన రూ.3 వేలు పింఛనును లబ్ధిదారుకు అందజేశారు.


పెదకొత్తూరులో ఇజ్జిన దేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బళ్ల వరలక్ష్మి

హుషారుగా ఆడుదాం ఆంధ్రా


వేళంగి హైస్కూలులో వాలీబాల్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు


కరపలో క్రికెట్ పోటీలకు టాస్ వేసిన ఎంపీడీఓ అప్పారావు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్ర పోటీలను అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీలలో మండల స్థాయిలో ప్రతిభ కనబరచి నియోజకవర్గ, జిల్లాస్థాయికి ఎంపిక కావాలన్నారు. 21 గ్రామ సచివాలయాల్లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించి, మండలస్థాయి పోటీలను ప్రారంభించినట్టు తెలిపారు. కరప, పెద్దాపురప్పాడు హైస్కూళ్ల మైదానాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంఈఓ-2 పి.సత్యనారాయణలతో కలసి క్రికెట్ ఆటగాళ్లను పరిచయంచేసుకుని, టాస్‌వేసి పోటీలను ప్రారంభించారు. ఎంపీడీఓ అప్పారావు, ఎంఈఓ-2 సత్యనారాయణ క్రీడామైదానాలను సందర్శించి పోటీలను పరిశీలించి, పీడీలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు నిర్వహణపై సూచనలు ఇచ్చారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్

కాకినాడ రూరల్: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా కాకినాడ డి4 పరిధిలో శుక్రవారం ఉదయం 11.30 నుంచి 2.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల వరకు శశికాంత్‌నగర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఎ.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, బ్యాంక్‌కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, సీటీవో కాలనీ పార్క్ ఏరియా, సౌజన్య నగర్ ఏరియా, పద్మానగర్, ఇన్‌కమ్ టాక్స్ కాలనీ, శశికాంత్ నగర్, ఆర్ఆర్ నగర్ ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే బోట్‌క్లబ్ 11 కేవీ పరిధిలో దుర్గా విద్యుత్ నగర్, అంజని అపార్ట్‌మెంట్ ప్రాంతం, సీటీవో కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, వైద్య నగర్, పిల్లి వారి వీధి, వాసంశెట్టి వారి వీధి, చాకో గార్డెన్స్, వినాయక నగర్, కొత్తూరు, నూకాలమ్మ గుడి ఏరియా, లక్ష్మీ టెంట్ హౌస్ ఏరియా, నాగేంద్రస్వామి గుడి ఏరియా, బోట్‌క్లబ్ ప్రాంతాలకు, 11 కేవీ ఆర్టీవో కార్యాలయం ఫీడర్ పరిధిలోని జవహర్ అపార్ట్‌మెంట్, తోట సుబ్బారావు నగర్, విద్యానగర్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ, స్టేడియం, ఆశ్రమ స్కూల్ ఏరియా, దొర అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ ఎ.ప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

- ఎంపీ వంగా గీత


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవించి లేకపోయినా ఆయన రూపొందించిన భారత రాజ్యాంగం రూపంలో ఇప్పటికీ, ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలచి ఉంటారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. విజయవాడలో ఈ నెల 19వ తేదీన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్‌లో 'సామాజిక సమత సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల అమలుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితంపై ఫొటో ప్రదర్శన

కాకినాడ సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున బుధవారం రాత్రి తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టర్, జేసీ ఈ ప్రదర్శనను ప్రారంభించనున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితాలు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కిశోర్

కాకినాడ సిటీ: ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులు, అభ్యంతరాల విషయంలో చర్యలు తీసుకుని ఈ నెల 22వ తేదీ నాటికి తుది జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ ఇట్ల కిశోర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల రూపకల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం-6 మొత్తంగా 17,899, ఫారం-7 మొత్తంగా 20,807 దరఖాస్తులు, ఫారం-8 మొత్తంగా 24,697 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్.అప్పారావు, ఎంఏ కామరాజు, విజయ రామయ్య, టి.నాగేశ్వరరావు, రూరల్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, మధు కిరణ్, రమణ, అనిల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కాకినాడ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలోని నేమాం, పండూరు తదితర గ్రామాలలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను నియోజకవర్గ ఈఆర్వో ఇట్ల కిషోర్ పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ర్యాంపులు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్డీవో వెంట రూరల్ తహసీల్దార్ మురార్జీ, బూత్ స్థాయి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీతారామ స్వామి విశ్వరూప సందర్శనం



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు విశ్వరూప సందర్శనం ఇచ్చి భక్తులను తరింపజేశారు. స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.